సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
3

బుధవారం । 22 । మార్చి । 2023



రేపటి నుంచి పోశమ్మ జాతర
గండి పోశమ్మ అమ్మవారి జాతర గురువారం నుంచి ఐదు రోజులు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 8లో



బలోపేతానికి ఆర్థిక సహకారం
జాతీయ షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ గిరిజనుల ఆర్థిక బలోపేతానికి సహకరించాలని అరకు ఎంపీ మాధవి కోరారు. 8లో



శోభకృత్ సందడి
తెలుగు కొత్త సంవత్సరాది శోభకృత్ నామ ఉగాది పండగ పురస్కరించుకుని మార్కెట్లలో సందడి నెలకొంది. 8లో

న్యూస్‌రీల్

ఉగాది శుభాకాంక్షలు

సాక్షి,పాడేరు: జిల్లా ప్రజలకు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రీశోభకృత్ నామ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, పాడేరు, రంపచోడవరం ఐటీడీఏ పీవోలు రోణంకి గోపాలకృష్ణ, సూరజ్ గనోరే, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు, అరకులోయ, రంపచోడవరం ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులాపల్లి ధనలక్ష్మి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సంతోషంగా ఉండాలని వారు ఆకాంక్షించారు.

25న కిసాన్ మేళా



ఏడీఆర్ సురేష్‌కుమార్

చింతపల్లి: స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఈ నెల 25 న కిసాన్ మేళా నిర్వహించనున్నట్టు ఏడీఆర్ డాక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. మేళాకు ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పలువురు రైతులు హాజరు కానున్నట్టు ఆయన పేర్కొన్నారు. పరిశోధన స్థానంలో ఇప్పటి వరకు అభివృద్ధి చేసిన వంగడాలు, వాటి దిగుబడులు, లాభాలపై రైతులకు అవగాహన కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. కిసాన్ మేళాకు గిరిజన రైతులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్‌కు సత్కారం



జమాల్‌ఖాన్‌ను సత్కరిస్తున్న తెలంగాణ హోంమంత్రి మహమూద్‌అలీ

చింతూరు: స్థానిక ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ వైద్యసేవలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ మంగళవారం హైదరాబాద్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమూలికల వైద్యం ద్వారా ఎంతోమందికి వైద్యసేవలు అందించడం హర్షణీయమన్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో నయంకాని ఎన్నో దీర్ఘకాలిక రోగాలు జమాల్‌ఖాన్ ఆయుర్వేద వైద్యంతో నయమవుతున్నాయని ఆయన అన్నారు. కరోనా కాలంలో ఎంతోమందికి ఉచితంగా ఔషధాలు ఇవ్వడంతో పాటు పాముకాటుకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముస్లిం ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్, బీఆర్ఎస్ నాయకుడు మానె రామకృష్ణ, అనిల్‌రెడ్డి, షాజహాన్ పాల్గొన్నారు.

తాచుపాము హల్‌చల్



అడ్డతీగల: మండలం లోని మారుమూల గ్రామమైన సీతారాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం తాచుపాము హల్‌చల్ చేసింది. పామును గమనించిన ఉపాధ్యాయుడు ఎం.మధుమోహన్, గ్రామ వలంటీర్ అబ్రహంతో కలిసి హతమార్చారు.

భూ రీసర్వే వేగవంతం

- జేసీ శివ శ్రీనివాసరావు



భూ రీసర్వేను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాసరావు

దుంబ్రిగుడ: భూ రీసర్వేను రెవెన్యూ అధికారులు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాసరావు సూచించారు. సొవ్వ పంచాయతీ ఒడియావలస గ్రామంలో జరుగుతున్న భూ రీసర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ సర్వేయర్లతో మాట్లాడి వారి నుంచి సమస్యలు తెలుసుకున్నారు. భూరీసర్వే కోసం ప్రభుత్వం కల్పించిన సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ ముజీబ్, ఆర్ఐ హరి, వీఆర్వో రవి, సర్వేయర్ సంగీత తదితరులు పాల్గొన్నారు.

రాగి జావతో సంపూర్ణ ఆరోగ్యం



విద్యార్థులకు రాగి జావ తాగిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇతర అధికారులు

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- జిల్లాలో 91,412 మంది విద్యార్థులకు పంపిణీ

సాక్షి, పాడేరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంక్షేమం లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న గోరుముద్దలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నారని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం తన సందేశాన్ని తెలియజేశారు. స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులతో రాగి జావను తాగించారు. అనంతరం విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. ఆయా పాఠశాలల్లో ఆంగ్ల బోధన కార్యక్రమాలు, వారికున్న పరిజ్ఞానంపై ఆయన సమీక్షించారు. క్లాస్ టీచర్, ఇంగ్లీషు టీచర్ ఉన్నారా అని ప్రశ్నించారు. రోజూ మూడు ఆంగ్ల అక్షరాలు నేర్చుకోవడం ద్వారా వేయి అక్షరాలలో పరిణితి చెంది ఇంగ్లీషు బాగా మాట్లాడతారని కలెక్టర్ సూచించారు. జగనన్న గోరుముద్దలో రాగి జావను మరో పౌష్టికాహారంగా పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాలోని 22 మండలాల పరిధిలో 2,704 పాఠశాలల్లో చదువుతున్న 91వేల 412మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందన్నారు. వంశపారపర్యంగా, భౌగోళిక పరిస్థితులు కారణంగా రక్తహీనత సమస్యలు ఉంటాయన్నారు. ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన రాగిజావలో ఐరన్, కాల్షియం, పొటాషియం అధికంగా ఉంటాయన్నారు. జగనన్న గోరుముద్ద పథకంలో పౌష్టికాహారాన్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతులై బాగా చదువుకోవాలన్నారు. జిల్లాలోని 22 మండలాల పరిధిలోని 2704 ప్రభుత్వ పాఠశాలలో రాగి జావ పంపిణీ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో డీఈవో సలీమ్ బాషా, డీఆర్వో అంబేద్కర్, విద్యాశాఖ ఏడీ ఉదయ్ భాస్కర్, డీఎస్‌వో ఆర్.శివప్రసాద్, డీఎం గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డోర్ టు డోర్ కార్గో సేవలు

- ఉగాది నుంచి అమలుకు సన్నద్ధం
- షిప్‌మంత్ర లాజిస్టిక్స్‌తో ఆర్టీసీ ఒప్పందం
- ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సదుపాయం

-8లో

మిర్చి రైతుల్లో గుబులు

అకాల వర్షాలు విలీన మండలాల్లో మిర్చి రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మరోపక్క వలస కూలీలకు ఉపాధి దూరం చేసి అవస్థలు పాల్జేస్తున్నాయి. కాయ కోత పనులు నిలిచిపోవడంతో సరిహద్దు రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీలు తిరిగి వెళ్లిపోతున్నారు. దీంతో మిర్చి రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది.



కోతకు నోచుకోని మిరప పైరు

- అకాల వర్షాలతో అవస్థలు
- నిలిచిపోయిన కాయ కోత పనులు
- స్వగ్రామాలకు వెళ్లిపోతున్న సరిహద్దు రాష్ట్రాల కూలీలు
- దిక్కుతోచని స్థితిలో అన్నదాత

ఎటపాక: విలీన మండలాలైన ఎటపాక, కూనవరం, వీఆర్‌పురం, చింతూరు రైతులకు మిర్చి సాగు ప్రధాన ఆదాయ వనరు. ఈ పంటను ఆయా మండలాల్లో సుమారు 8 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఏటా జనవరి నాటికి పైరు కోతకు వస్తుంది. ఏప్రిల్ వరకు కాయ కోత పనులు ఉంటాయి.

కూలీల కొరతతో..

స్థానికంగా కూలీల కొరత కారణంగా సరిహద్దు రాష్ట్రాలైన చత్తీస్‌గఢ్, ఒడిశాలోని సరిహద్దు గ్రామాల కూలీలు (గొత్తికోయలు)పై ఈ ప్రాంత రైతులు ఆధారపడుతుంటారు. దీంతో వారంతా కుటుంబాలతో తిండి గింజలు పట్టుకుని డిసెంబర్‌లోనే ఇక్కడికి వచ్చేస్తారు. మూడు నెలలపాటు ఇక్కడే ఉంటారు. గుంపులు గుంపులుగా వాగులు, గోదావరి ఇసుక దిబ్బలపై నివాసం ఉంటారు. నీటి సౌకర్యం ఉన్న చోట గుడారాలు ఏర్పాటు చేసుకుని నివసిస్తారు.

రెండు విధానాల్లో కూలి చెల్లింపు

వీరికి రైతులు రోజు వారీ, కాయ సేకరణ విధానాల్లో రైతులు కూలి చెల్లిస్తుంటారు. రోజువారీ కూలి రూ.300 వరకు లభిస్తోంది. ఏప్రిల్ వరకు ఇక్కడే ఉండి కోత పనులు పూర్తయిన తరువాత వారి స్వగ్రామాలకు వెళ్లి పోతుంటారు. ఈ ప్రాంతంలో కూలీల కొరత కారణంగా వీరే రైతులకు ప్రధాన ఆధారం.

గుత్తికోయలు వస్తేనే..

వీరొస్తేనే మిర్చి పంట రైతుల చేతికందేది. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాల వల్ల మిర్చి రైతులకు దిక్కుతోచని స్థితి ఎదురైంది. ఈ ప్రాంతంలో సుమారు 10 వేల మందికి పైగా ఆదివాసీ కూలీలు ఉపాధి పొందుతున్నారు. వర్షం పడితే వీరి గుడారాలు పాడవుతాయి. అందువల్ల ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడ ఉండటానికి ఇష్టపడరు. ఇప్పటి వరకు పనిచేసిన కూలి డబ్బులు లెక్కలు చూసుకుని స్వగ్రామానికి వెళ్లిపోతున్నారు.

రైతుల్లో ఆందోళన

మిర్చి కోతలు పూర్తికాకుండా వీరు వెళ్లిపోతుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. స్థానికంగా కూలీలు దొరకని పరిస్థితి ఉండటంతో దిగులు చెందుతున్నారు. గోదావరి వరదల కారణంగా మిర్చి సాగు ఆలస్యంగా ప్రారంభమైంది. ఇప్పటి వరకు ఎకరాకు రూ.1.50లక్షల మేర పెట్టుబడి పెట్టారు. ఇప్పటివరకు 50 శాతం మేర కోతలు పూర్తయ్యాయి.

ఆదివాసీలు లేకుంటే ఇబ్బందే



సాగు చేపట్టిన మిర్చి తోటల్లో ఇప్పటివరకు సగం మేర మాత్రమే కోతలు పూర్తయ్యాయి. వలస ఆదివాసీ కూలీలు వెళ్లిపోతే కోత పనులకు ఇబ్బందులు తప్పవు. అకాల వర్షాల కారణంగా ఈ సమస్య ఎదురైంది.

– పోలిన సీతారామయ్య, రైతు, గొరిదేవిపేట

ఆస్పత్రులకు వైద్య పరికరాల పంపిణీ

- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పాడేరు రూరల్ : పాడేరు ఐటీడీఏ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవసర వైద్య పరికరాల పంపిణీకి అవసరమైన చర్యలు చేపట్టామని ఐటీడీఏ పీవో ఆర్. గోపాలకృష్ణ తెలిపారు. మంగళవారం పాడేరు ఐటీడీఏ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆస్పత్రి వైద్యాధికారులు, కేర్ ఇండియా ఫౌండేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఇండియా ఫౌండేషన్ , ఐటీడీఏ సంయుక్తంగా సీఎస్ఆర్ పథకంలో వైద్య పరికరాలు పంపిణీకి ఒప్పందం జరిగిందన్నారు. గతంలో చేసిన ప్రతిపాదన చేసిన వైద్య పరికరాలకు అదనంగా కావాల్సిన పరికరాలను ప్రతిపాదించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అంబులెన్సులు, అవసరమైన చోట మహా ప్రస్థానం అంబులెన్సులను సమకూరుస్తామన్నారు. పాడేరు జిల్లా ఆస్పత్రి, చింతపల్లి, అరకు సామాజిక ఆస్పత్రులలో శస్త్ర చికిత్సలకు అవసరమైన వైద్య పరికరాలను అందిస్తామని తెలిపారు. చింతపల్లి సామాజిక ఆస్పత్రికి సిజేరియన్‌కు అవసరమైన వైద్య పరికరాలు కావాలని కోరగా నిధులు విడుదల చేస్తున్నామని అవసరమైన పరికరాలను కొనుగోలు చేయాలని సూచించారు. ముంచంగిపుట్టు ఆస్పత్రికి బీపీ ఆపరేటర్, కంప్యూటర్, జనరేటర్‌కు డీజిల్ కావాలని కోరారు. ఇందుకు అవసరమైన నిధులు విడుదల చేస్తామని పీవో స్పష్టం చేశారు. ఎస్ఆర్సీ, ఎస్‌హెచ్‌ఎం, ఎంసీహెచ్, బ్లడ్ స్టోరేజ్ విభాగాలలో ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్‌బాషాను ఆదేశించారు. సమావేశంలో కేర్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధి సుబ్రమణ్యం, 11 మండలాల వైద్యాధికారులు పాల్గొన్నారు.



శోభకృత్ శోభాయమానం

కొత్త ఊసులు.. కొంగొత్త ఆశలు.. వేకువకువలతో చిన్నారుల కిలకిలారావాలు.. శోభకృత్ నామసంవత్సరానికి శోభాయమాన స్వాగతాలు.. సంప్రదాయ దుస్తులు ధరించిన విద్యార్థులు ముత్యాల ముగ్గులతో అలరించారు. పువ్వులు, ఆకులు, మామిడి కాయలతో పర్యావరణ హితంగా కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. ఉగాది సంబరాలకు ఒకరోజు ముందే శ్రీకారం చుట్టారు.

ఘనంగా నూకాలమ్మ పండగ



చింతలవీధిలో నూకాలమ్మతల్లి మండపం వద్ద భక్తులు పూజలు

సాక్షి,పాడేరు: నూకాలమ్మతల్లి పండగను మంగళవారం జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పాడేరు మండలానికి సంబంధించి కక్కి, మలకపాలెం, చోడిపల్లి గ్రామాల్లోని నూకాలమ్మతల్లి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు తీర్చుకున్నారు. పాడేరు సమీపంలోని చింతల వీధి వద్ద వేపచెట్టు మొదలులో కొలువుదీరిన నూకాలమ్మతల్లి రాతి విగ్రహానికి పాడేరుతో పాటు అనేక ప్రాంతాలకు చెందిన భక్తులంతా పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన ఏర్పాటుచేశారు. హుకుంపేట మండలం పెదగరువు ఆశ్రమ పాఠశాల ఎదుట పుట్టలో కొలువుదీరిన నూకాలమ్మతల్లి రాతి విగ్రహం వద్ద గిరిజనులు పూజలు చేశారు.



వేపచెట్టు దిగువన కొలువుదీరిన నూకాలమ్మతల్లి రాతి విగ్రహం

అంతర్ రాష్ట్ర సరిహద్దుల పరిశీలన

- ఒడిశా వాసులు ఆక్రమించారని ఎస్టీ కమిషన్ దృష్టికి సమస్య
- జామిగుడను సందర్శించిన తహసీల్దార్, సిబ్బంది
- వాస్తవ వివరాల సేకరణ



కొజ్జరిగుడ ఆంధ్ర- ఒడిశా సరిహద్దులను పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ భాస్కరరావు

పెదబయలు: మండలంలోని జామిగుడ పంచాయతీ కొజ్జరిగుడ రెవెన్యూ మెట్టగుడకు ఆనుకొని ఉన్న ఆంధ్రా–ఒడిశా సరిహద్దు భూములను తహసీల్దార్ భాస్కరరావు ఆధ్వర్యంలో సిబ్బంది పరిశీలించారు.రాష్ట్ర ఎస్టీ కమిషన్ దృష్టికి సరిహద్దు గ్రామాల ప్రజలు ఫిర్యాదు చేయడంతో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు మంగళవారం ఆయన 1,9,10 సర్వే నంబర్లలో భూములను పరిశీలించారు. సరిహద్దుల్లో ఎవరి పరిధిలో వారే ఉన్నట్టు వారు గుర్తించారు. సాగు భూముల కోసం గొడవలు లేవని, సరిహద్దు గ్రామాలకు ఆనుకుని అటవీ ప్రాంతం ఉన్నందున కొండకు వెళితే ఇది ఒడిశా రాష్ట్రానికి చెందినదని గొందిగుడ గ్రామస్తులు గొడవకు దిగుతున్నారని తహసీల్దార్ దృష్టికి జామిగుడ పంచాయతీ ప్రజలు తీసుకొచ్చారు. దీంతో రెవెన్యూ భూములు మాత్రమే పరిశీలన చేస్తామన్నారు. అటవీ భూములు అటవీ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఇరు రాష్ట్రాల సరిహద్దు వరకు రోడ్డు నిర్మాణం జరుగుతుందని సరిహద్దు ప్రదేశంలో గ్రామ పంచాయతీ బోర్డు ఏర్పాటు చేయాలని పంచాయతీ సర్పంచ్‌ను కోరారు. అనంతరం జామిగుడ వంతెన నిర్మాణానికి సంబంధించి పాత రోడ్డు ప్రదేశంలో కాకుండా పట్టా భూముల్లో రోడ్డు నిర్మాణానికి పూనుకున్నారన్నారు. పాత రోడ్డు గుండానే నిర్మాణం చేపట్టాలని జామిగుడ గ్రామ రైతులు తహసీల్దార్‌ను కోరారు. సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. మాజీ ఎంపీపీ వైఎస్సార్ సీనియర్ నాయకులు జర్సింగి బాలంనాయుడు.వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, మాజీ ఎంపీటీసీ మజ్జి చంద్రుబాబు, మాజీ జెడ్పీటీసీ కొంటా సూర్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు పాంగి సింహాచలం, వంతాల భూపన్న, భాస్కరరావు, సర్వేయర్ సత్యనారాయణ,ఆర్ఐ సింహాచలం, వైస్ సర్పంచ్ కిల్లో కామేశ్వరరావు పాల్గొన్నారు.

శివారు గ్రామాలకు రోడ్లు

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



రహదారి పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

అడ్డతీగల: రహదారులు మెరుగుపర్చడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. ఏలేశ్వరం–జెడ్డంగి మధ్య అడ్డతీగల మండలంలో 10 కిలోమీటర్ల మేరకు రూ.22.47 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రహదారి పునర్నిర్మాణ పనులకు గొంటువానిపాలెం వద్ద రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మంగళవారం భూమిపూజ, అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శివారు గ్రామాలకు రహదారుల కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేస్తోందన్నారు. ఏజెన్సీకి ప్రధానమైన రహదారిగా ఏలేశ్వరం–అడ్డతీగల మధ్య పాడైన రహదారిని మెరుగుపర్చేందుకు ప్రభుత్వం రూ.22.47 కోట్లు కేటాయించి 10 కిలోమీటర్ల మేరకు పనులు చేపడుతున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా సంబంధిత పనులను నిర్వహించి త్వరలో రహదారి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. రాష్ట్ర రోడ్డు డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు మద్దాల వీర్రాజు, ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, రాజవొమ్మంగి జెడ్పీటీసీ ఒడుగుల జ్యోతి, రాజవొమ్మంగి వైఎస్సార్‌సీపీ మండలశాఖ అధ్యక్షుడు సింగిరెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బలోపేతానికి ఆర్థిక సహకారం

- అరకు ఎంపీ మాధవి

కొయ్యూరు: జాతీయ షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ(ఎన్ఎస్ఎఫ్‌డీసీ) గిరిజనుల ఆర్థిక బలోపేతానికి సహకరించాలని అరకు ఎంపీ మాధవి కోరారు. పార్లమెంట్ హౌస్‌లో మంగళవారం నిర్వహించిన ఎస్టీ,ఎస్సీ సంక్షేమ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవాలని కమిటీ చైర్మన్ కిరిట్ ప్రేం జిబైని కోరారు. గిరిజన ప్రాంతానికి పత్యేకంగా నిధులు కేటాయించాలని ఆమె విన్నవించారు. గిరిజనులు అన్ని రంగాల్లో రాణించేందుకు సంస్థ సహకరించాలని కోరారు. దీనిలో సంస్థ డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

డోర్ టు డోర్ కార్గో సేవలు

- ఉగాది నుంచి అమలుకు సన్నద్ధం
- షిప్‌మంత్ర లాజిస్టిక్స్‌తో ఆర్టీసీ ఒప్పందం
- ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సదుపాయం
- ప్రైవేటు పార్సిల్ సంస్థల కంటే తక్కువ డెలివరీ చార్జీలు


విశాఖ ద్వారకా బస్‌స్టేషన్‌లో పార్సిల్ రవాణా కార్యాలయం

సాక్షి, విశాఖపట్నం: కార్గో సేవల్లో ఆర్టీసీ దూకుడు ప్రదర్శిస్తోంది. ఇప్పటికే వినియోగదారుల ఆదరణతో దూసుకుపోతున్న ఈ కార్గో ఇప్పుడు వారికి మరింత చేరువకానుంది. ఉగాది నుంచి పార్సిల్స్, కొరియర్స్, 50 కిలోల లోపు బరువున్న సరకులు/వస్తువులను 20 కిలోమీటర్ల పరిధిలో డోర్ పికప్, డెలివరీ చేయడానికి సన్నద్ధమవుతోంది. ఇందుకోసం షిప్‌మంత్ర అనే లాజిస్టిక్స్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. తొలిదశలో ప్రయోగాత్మకంగా విజయవాడ–విశాఖపట్నం నగరాల మధ్య ఈ సేవలను అందుబాటులోకి తెస్తోంది. ఇకపై ఎవరైనా ఆర్టీసీ కార్గో ద్వారా పార్సిల్స్ లేదా కొరియర్ కవర్లను పంపాలనుకున్న వారు తమ ఇంటి నుంచే వాటిని ×షిప్‌మంత్ర ఆన్‌లైన్ బుకింగ్ పోర్టల్× ద్వారా బుక్ చేసుకునే సదుపాయాన్ని కల్పిస్తున్నారు. దీని ద్వారా డోర్ పికప్, డెలివరీ సదుపాయాన్ని పొందవచ్చు. ప్రారంభ కానుకగా ఈ నెల 31 వరకు మొదటి మూడు బుకింగ్‌లకు ఉచిత డోర్ పికప్, డోర్ డెలివరీ సౌకర్యాన్ని కార్గో వినియోగదారులకు ఆర్టీసీ యాజమాన్యం కల్పిస్తోంది. ఇలా సంబంధిత షిప్‌మంత్ర లాజిస్టిక్స్‌కు చెందిన వ్యక్తులు డోర్ పికప్, డెలివరీ సేవలందిస్తారు. వాటిని ఆర్టీసీ కార్గో బుకింగ్ కౌంటర్‌లో అందజేస్తారు. అక్కడ నుంచి నిర్ణీత ప్రాంతాలకు పంపిస్తారు. వాటిని ఏ బస్సులో పంపిస్తున్నారో ఆర్టీసీ కార్గో విభాగం నుంచి షిప్‌మంత్రకు పంపిస్తారు. అక్కడ నుంచి నిర్దేశిత చిరునామాకు డెలివరీ చేస్తారు. ఇందుకుగాను స్వల్పంగా రుసుము వసూలు చేస్తారు. వీటి చార్జీలను నేడో, రేపో ఖరారు చేయనున్నారు. కొత్తగా ప్రవేశపెడ్తున్న ఈ సదుపాయం వల్ల వినియోగదారునికి తక్కువ ఖర్చుతోనే తమ సరకులు/పార్సిళ్లను ఇంటి నుంచే పంపించుకునే వెసులుబాటు కలుగుతుంది.

కార్గో జోన్ లక్ష్యం రూ.64 కోట్లు

ఆర్టీసీ విజయనగరం కార్గో జోన్ పరిధిలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలున్నాయి. ఈ జోన్ కార్గో ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.21 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. కొత్తగా కార్గో డోర్ డెలివరీ సదుపాయాన్ని విస్తరిస్తున్న నేపథ్యంలో 2023–24 సంవత్సరానికి కార్గో రాబడి లక్ష్యం రూ.64 కోట్లుగా నిర్దేశించారు. ఇతర లాజిస్టిక్స్‌కంటే ఆర్టీసీ కార్గో రవాణా చార్జీలు తక్కువగా ఉండడం, డోర్ పికప్, డెలివరీ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొస్తుండడం లాజిస్టిక్స్ ఆదాయం పెరుగుతుందని ఆర్టీసీ వర్గాలు భావిస్తున్నాయి.

డోర్ పికప్, డెలివరీకి ఆదరణ



ఉగాది నుంచి కొత్తగా ప్రవేశ పెడుతున్న కార్గో డోర్ పికప్, డెలివరీ సదుపాయానికి మంచి ఆదరణ ఉంటుంది. ఇప్పటికే ఆర్టీసీ కార్గోపై వినియోగదారుల్లో విశ్వసనీయత ఉంది. రాష్ట్రంలో 24 గంటల్లోనే సరకును చేరవేయడం, ప్రైవేటు లాజిస్టిక్స్‌కంటే 25 శాతం తక్కువ.. 2016 నాటి చార్జీలే ఇప్పటికీ వసూలు చేయడం వంటివి ఆర్టీసీకి కలిసొచ్చే అంశం.

– కె.వెంకట్రావు, డీసీఎం, విజయనగరం జోన్

రేపటి నుంచి గండి పోశమ్మ అమ్మవారి జాతర

దేవీపట్నం: గండి పోశమ్మ అమ్మవారి వేడుకలు గురువారం నుంచి ఐదు రోజులగా పాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎల్లవరంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో అమ్మవారి జాతర ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్సీ అనంతబాబు ఆవిష్కరించారు. ఉత్సవాలకు జిల్లాతో ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారని, అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ ఈవో లక్ష్మికుమార్ తెలిపారు. ఐదు రోజులు పాటు జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామన్నారు.

శోభకృత్ సందడి

సాక్షి, పాడేరు: తెలుగు కొత్త సంవత్సరాది శోభకృత్ నామ ఉగాది పండగ పురస్కరించుకుని మార్కెట్లలో సందడి నెలకొంది. ప్రజలు ఉగాది పండగకు అవసరమయ్యే పూజా సామగ్రిని కొనుగోలు చేసుకున్నారు. ఉగాది పండగకు ప్రధానమైన మామిడికాయలు, వేప పువ్వుకు ఈ ఏడాది కూడా డిమాండ్ నెలకొంది. ఏజెన్సీలో మామిడి పంట పూత దశలోనే ఉంది.కొన్ని చోట్ల పిందెలు కూడా చిన్నవిగా ఉండడంతో విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లోని మైదాన ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన మామిడి కాయలను వ్యాపారులు విక్రయించారు. సినిమాహాల్ సెంటర్, పాతబస్టాండు, ఆర్టీసీ కాంప్లెక్సు రోడ్డు, మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో వేపపువ్వు అమ్మకాల సందడి నెలకొంది. ఉగాది పండగ సందర్భంగా బుధవారం జిల్లాలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణానికి ఆలయ కమిటీ, అర్చకులు ఏర్పాట్లు చేశారు.

తమ్ముడిపై హత్యాయత్నం చేసిన అన్నకు రెండేళ్ల జైలు

చోడవరం రూరల్ : ఆస్తి కోసం సొంత తమ్ముడిపై హత్యాయత్నానికి పాల్పడిన అన్నకు రెండేళ్ళు జైలు శిక్ష విధిస్తూ చోడవరం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సత్తి అరుణశ్రీ మంగళవారం తీర్పు చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పాడేరు మండలం ఆడారిమెట్ట గ్రామానికి చెందిన సీదరి రామారావు ఫిర్యాదు ప్రకారం తన అన్న సీదరి బాలన్న తమ గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి దగ్గర ఉన్న సర్వే నంబర్ 1–బిలో ఉన్న 52 సెంట్ల భూమి విషయమై గొడవకు దిగి కత్తితో తలపై నరికి హత్యా యత్నానికి ప్రయత్నించాడు. తలపై గాయంతో రామారావు పాడేరు ఆస్పత్రిలో చేరగా అతడి వాంగ్మూలం మేరకు పాడేరు ఎస్‌ఐ జి.లక్ష్మణరావు కేసు నమోదు చేశారు. నిందితుడు బాలన్నపై ఐపీసీ 307 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసి నేర అభియోగపత్రం దాఖలు చేశారు. 2021 ఆగస్టు 31వ తేదీన నమోదైన కేసు పూర్వాపరాలను పరిశీలించిన మీదట నిందితుడు బాలన్నపై మోపిన అభియోగం రుజువు కావడంతో రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, 500 రూపాయల జరిమానా విధిస్తూ చోడవరం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సత్తి అరుణశ్రీ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పీపీ వేచలపు వెంకటరావు తన వాదనలు వినిపించారు.

చింతూరులో మూడు రోజులు గ్రామసభలు


మాట్లాడుతున్న ఎంపీడీవో రవిబాబు

చింతూరు: పోలవరం ముంపునకు గురవుతున్న చింతూరు గ్రామానికి సంబంధించి ఆర్‌అండ్‌ఆర్ సర్వే నిమిత్తం మూడు రోజుల పాటు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రవిబాబు తెలిపారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్వేపై వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక ఆర్థిక సర్వే ఆధారంగా చింతూరులోని 1918 కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తిస్తుందన్నారు. దీనికి సంబంధించి మార్పులు, చేర్పుల వివరాలను వలంటీర్లు సేకరిస్తారని ఆయన తెలిపారు. దీనిలో భాగంగా ప్రస్తుత కుటుంబ వివరాలతో పాటు 18 ఏళ్ల నిండిన వారి వివరాలు, వలస వెళ్లిన వారి వివరాలు, మృతిచెందిన వారి వివరాలను సేకరిస్తామని తెలిపారు. గిరిజనులకు, గిరిజనేతరులకు విడివిడిగా ఎక్కడ పునరావాసం కల్పిస్తారనేది నిర్వాసితులకు సమాచారం ఇస్తారని ఎంపీడీవో తెలిపారు. సేకరించిన వివరాలతో పాటు కుటుంబాల వివరాలను ఈనెల 27 నుంచి 29 వరకు నిర్వహించే గ్రామసభల్లో వెల్లడిస్తారని ఆయన తెలిపారు. వివరాల సేకరణకు 42 వలంటీర్లను 21 క్లస్టర్లుగా విభజించామని, 27న స్థానిక సంతమార్కెట్ ఆవరణలో, 28న బీసీ కాలనీలో, 29న ఎస్టీ కాలనీలో ఉదయం 10.30 నుంచి గ్రామసభలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. వలంటీర్లు వచ్చిన సమయంలో నిర్వాసితులు తగిన సమాచారాన్ని వారికి అందించాలని, ఏవైనా అభ్యంతరాలుంటే గ్రామసభలో తెలపాలని ఎంపీడీవో కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కారం కన్నారావు, కార్యదర్శి ప్రసాదరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


గాయపడిన నువ్వ దుర్గ

చింతపల్లి: మండలంలోని అంతర్ల వద్ద మంగళవారం రెండు ద్విచక్రవాహనాల ఢీకొని ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని 108 వాహనంలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఆస్పత్రికి తరలించారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చింతపల్లి నుంచి నాతవరం పంచాయతీ, సరుగుడుకి చెందిన నువ్వ దుర్గ ద్విచక్రవాహనంపై జడుమురు వెళ్తుండగా, ఎదురుగా రింతాడ నుంచి వస్తున్న చింతపల్లికి చెందిన అల్లంక మనోజ్ ఎదురుగా వచ్చి బలంగా ఢీకున్నారు. సంఘటనలో ఇరువురికి బలమైన గాయాలయ్యాయి.

దట్టంగా పొగమంచు


పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి వెళ్లే మార్గంలో దట్టంగా కురుస్తున్న మంచు

సాక్షి, పాడేరు: ఆరు రోజులుగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో మంగళవారం వేకువజాము నుంచి దట్టంగా పొగమంచు కురవడంతో మన్యంలో వింత వాతావరణం నెలకొంది. పాడేరు, హుకుంపేట, అరకులోయ, జి.మాడుగుల, చింతపల్లి ప్రాంతాల్లో పొగమంచు కురిసింది. పాడేరు పట్టణంతో పాటు సమీప గ్రామాల్లో ఉదయం 9 గంటల వరకు మంచు తీవ్రత నెలకొంది. శీతాకాలాన్ని తలపించింది. ఆ తరువాత ఎండ కాయగా, మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమైంది. సాయంత్రం నుంచి పాడేరులో జల్లులు కురవగా, పలు ప్రాంతాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది.

ఘనంగా అటవీ దినోత్సవం


ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టీఎన్ రసూల్

పాడేరు రూరల్ : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎన్ రసూల్ అన్నారు. అంతర్జాతీయ అటవీ దినోత్సవం కార్యక్రమాన్ని మంగళవారం పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. బోటనీ విభాగాధిపతి డాక్టర్ ఎస్. చంద్రకళ మాట్లాడుతూ మెడిసిన్ ప్లాంటేషన్‌పై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ పి.రమేష్ కుమార్, జి.గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద చైన్ స్నాచింగ్

నర్సీపట్నం : పట్టణంలోని నూకాలమ్మ ఆలయం వద్ద అమ్మవారి దర్శనానికి వచ్చిన మహిళ మెడలో గుర్తు తెలియని వ్యక్తి చైన్ స్నానింగ్‌కు పాల్పడ్డాడు. బాధితురాలి కథనం ప్రకారం వివరాలివి. మున్సిపాలిటీ పరిధి వెంకునాయుడుపేటకు చెందిన పి.సత్యవతి అమ్మవారిని దర్శించుకునేందుకు అబిద్‌సెంటర్‌లోని ఆలయానికి వచ్చారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడాన్ని గమనించిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో బంగారు గొలుసు తెంపుకొని పరారయ్యాడు. మూడున్నర తులాల బంగారం తాడు పోవడంతో ఆమె లబోదిబోమంటున్నారు. గట్టి బందోబస్తు ఉన్నప్పటికీ అమ్మవారి ఆలయం వద్ద చైన్ స్నానింగ్ జరగడం పట్ల భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదంటున్నారు.

జాతీయ రహదారిపై వాహనం దగ్ధం


కాలిపోతున్న వాహనం

ఎటపాక: జాతీయ రహదారి నంబర్–30పై ఓ వాహనం ఇంజన్‌లో మంటలు చెలరేగడంతో మంగళవారం దగ్ధమైంది. ఒడిశా రాష్ట్రానికి చెందిన స్కార్పియో వాహనం భద్రాచలం వస్తుండగా ఎటపాక మండల పరిధిలోని గుండాల గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఈ ఘటన చోటు చేసుకుంది.ఇంజన్లో మంటలు ఎగిసి పడడంతో డ్రైవర్ వాహనాన్ని పక్కకు నిలిపాడు. వాహనంలో ఉన్న ఆరుగురు ప్రయాణికులు వెనువెంటనే కిందికి దిగడంతో పెను ప్రమాదం తప్పింది. కొద్ది సమయంలోనే వాహనం పూర్తిగా మంటల్లో కాలిపోయింది.

చేపల పెంపకంపై శిక్షణ

రంపచోడవరం: రంపచోడవరం సమీపంలోని పందిరిమామిడి కెవీకెలో అక్వేరియంలో చేపల పెంపకంలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కెవీకె శాస్త్రవేత్త కె.వీరాంజనేయులు తెలిపారు. ఈ నెల 23 నుంచి ఐదు రోజులు పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. జాతీయ మత్స్య అభివృద్ధి మండలి, హైదరాబాద్ ఆర్థిక సహకారంతో శిక్షణ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 9553364265 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

డంపింగ్ యార్డు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి



రోలుగుంట : కుసుర్లపూడి వద్ద మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఎస్‌ఐ బి.నాగకార్తీక్ గ్రామానికి వెళ్లి దర్యాప్తు చేశారు. స్థానికులు తెలిపిన వివరాలివి. సుమారు పది రోజులుగా ఈ వ్యక్తి కుసుర్లపూడిలో భిక్షాటన చేస్తూ గడిపాడు. ఎవరైనా వివరాలు అడిగితే తనది మాడుగుల అని చెప్పడం మినహా కచ్చిత సమా చారం లేదు. డంపింగ్ యార్డు వద్ద ఉన్న అతడి మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించి మార్చురిలో భద్రపరిచినట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు 9440796080 నంబర్‌కు సమాచారం తెలియజేయాలని కోరారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

- వైభవంగా అమ్మవార్ల ఉత్సవాలు
- ఆలయాలకు తరలివచ్చిన భక్తులు


ప్రత్యేకాలంకరణలో ధారాలమ్మ


నూకాలమ్మ అమ్మవారు దర్శనానికి బారులు తీరిన భక్తులు


రాసకొండ బాలచెల్లమ్మ ఉత్సవాలకు తరలివచ్చిన భక్తులు


గుడి ముంగిట ఊయల ఊగుతున్న భక్తులు


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

జి.మాడుగుల: మండలంలో బొయితిలి పంచాయతీ మద్దిగరువు గ్రామంలో మంగళవారం ఘనంగారాసకొండ బాల చెల్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం కనులపండువగా జరిగింది. డప్పు వాయిద్యాలతో భక్తిశ్రద్ధలతో ఘటాల ఊరేగింపు ఉత్సవం నిర్వహించి పూజలు నిర్వహించారు. ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకటగంగరాజు, ఎస్టీ సెల్ జోన్ ఇన్‌ఛార్జి కిముడు విశ్వ, సర్పంచ్ ఎల్ మాలన్న, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మ తిరునాళ్లు

రాజవొమ్మంగి: మండల కేంద్రంల నూకాలమ్మ జాతర మంగళవారం ఘనంగా జరిగింది. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు సమర్పించుకున్నారు. అమ్మవారి ఎదురుగా కొలువై ఉన్న కళ్యాణ పోతురాజుబాబును దర్శించుకొన్నారు. నూకాలమ్మ సంబరాల్లో ప్రధాన ఘట్టమైన ఊయలను గుడి ఎదుట ఏర్పాటు చేశారు. తొలుత ఆచారం ప్రకారం గరగలను ఊయలలో పెట్టి ఊపారు. అనంతరం భక్తులు వంతుల వారిగా ఊయల ఊగారు. లోక కళ్యాణార్థం, వర్షాలు సంమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని పూజలు చేశారు. అమ్మవారి తిరునాళ్లలో భాగంగా రాత్రంతా గరగ నృత్యాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

అనంతగిరి: మండల కేంద్రంలోని కొలువై ఉన్న నూకాంబిక అమ్మవారి పండగను భక్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పూజలు నిర్వహించి, మొక్కులను తీర్చుకున్నారు. మధ్యాహ్నం నుంచి గ్రామ పురవీధుల్లో డప్పులతో అమ్మవారిని ఊరేగించారు.

వైభవంగా ధారాలమ్మ పండగ

సీలేరు: ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పుగా పేరుగాంచిన నూకాలమ్మ అమ్మవారి పండుగ మంగవారం సీలేరులో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. దారాలమ్మ అమ్మవారి పండుగ అంగరంగ వైభవంగా జరిగింది. ఒడిశా, చత్తీస్‌ఘడ్, ఆంధ్రా నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారు.

నేడు ప్రత్యేక కార్యక్రమాలు

సాక్షి, పాడేరు:తెలుగు సంవత్సరాది శ్రీశోభకృత్ నామ ఉగాది పురస్కరించుకుని బుధవారం ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలంనాయుడు మంగళవారం ప్రకటనలో తెలిపారు. శివాలయంలో ప్రత్యేక పూజలు, సాయంత్రం పంచాంగ శ్రావణంతో పాటు వేదపండితులు, ఆధ్మాత్మిక సేవకులకు ఉగాది సేవా పురస్కారాలు పంపిణీతో సత్కరిస్తామన్నారు. అన్ని వర్గాల భక్తులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.